
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



### సాయుధ బలగాల కవాతు

పెదకూరపాడు: మండలంలోని పరస గ్రామంలో ఎస్‌ఐలు విపర్ల వెంకట్రావు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు గురువారం కవాతు నిర్వహించాయి.



### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 510.30 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,292, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

### వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



తెనాలి: జగ్గడిగుంట పాలెంలో సర్పంచ్ కె.బాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాటైన వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గురువారం సాయంత్రం ప్రారంభించారు.

## న్యూస్‌రీల్

### హైకోర్టు న్యాయమూర్తి మల్లికార్జునరావుకు సన్మానం



దాచేపల్లి: హైకోర్టు న్యాయమూర్తి తల్లాప్రగడ మల్లికార్జునరావుని గురువారం సన్మానించారు. పలు దేవాలయాల దర్శనానికి వచ్చిన ఆయన నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆగారు. సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి, జిల్లా జడ్జి గాజుల వెంకటేశ్వర్లు, గురజాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు బండి వీరభద్రుడు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది చల్లా రామిరెడ్డి, న్యాయవాదులు జక్కా చెన్నకేశవరావు, ఎనుముల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయశాస్త్ర సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరుఎడ్యుకేషన్: వావిలాల గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ శాస్త్ర సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రిన్సిపాల్ డి.రాంబాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణులై 18 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులు కోర్సులో చేరేందుకు అర్హులని తెలిపారు. డిగ్రీ విద్యావంతులు గ్రంథాలయ శాస్త్ర సర్టిఫికెట్ కోర్సుకు అర్హులేనని, కోర్సు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుందని వివరించారు. దరఖాస్తు కోసం గుంటూరు అరండల్‌పేట 12/3లోని సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 93962 38946 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

### గోగులమ్మ అమ్మవారిని తాకిన సూర్య కిరణాలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలోని పెదపులివర్రు గ్రామ దేవత శ్రీ గోగులమ్మ అమ్మవారిని గురువారం ఉదయం సూర్య భగవానుని కిరణాలు తాకాయి. అమ్మవారి ముఖ వర్చస్సును ఉదయం 6:55 గంటల నుంచి 7:15 వరకు తాకాయి. ప్రతి ఏటా చైత్ర మాసం ఆరంభమైన మూడో రోజు నాటి నుంచి అమ్మవారిని ప్రత్యక్ష సూర్యనారాయణుడు తాకుతారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ దృశ్యాన్ని తిలకించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రాతః కాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు.

### నేడు అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు విడుదల

శావల్యాపురం: సాగర్ జలాలు తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం విడుదల చేస్తున్నట్లు ఎన్నెస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు చెప్పారు. డీఈ మాట్లాడుతూ ఇటీవల సాగర్ జలాశయం నుంచి తాగునీటి అవసరాల నిమిత్తం 5,500 క్యూసెక్కులు విడుదల చేసినట్లు చెప్పారు. శుక్రవారం నుంచి అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 900 క్యూసెక్కులు విడుదల చేస్తామని, అందులో భాగంగా ఈనెల 16 వరకు అన్నీ మేజరు కాల్వలు పూర్తిస్థాయిలో మూతవేసి ప్రకాశం జిల్లా పరిధిలో గ్రామాలకు 900 క్యూసెక్కులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 17 నుంచి పల్నాడు జిల్లా అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఉన్న 25 తాగునీటి చెరువులన్నీ సాగర్ జలాలతో నింపుతామన్నారు. సాగర్ జలాలు వృథా చేయరాదన్నారు. ముఖ్యంగా చేపల చెరువులకు సాగర్ జలాలు వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నెస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో గ్రామాల్లోని చెరువులతోపాటు వాగులు, కుంటలను నూరుశాతం నింపాలన్నారు. సాగర్ జలాలు కేవలం తాగునీటి అవసరాల నిమిత్తం విడుదల చేస్తున్నామన్నారు.

### నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5800, గరిష్ట ధర రూ.7200, మోడల్ ధర రూ.6600 వరకు పలికింది.

# గుంటూరు సిద్ధం

- పల్నాడులో జననీరాజనం
- నేడు గుంటూరులో మేమంతా సిద్ధం సభ
- ఏర్పాట్లు పూర్తిచేసిన నేతలు
- తరలిరానున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ఉమ్మడి జిల్లాలో జననీరాజనం లభిస్తోంది. ఇప్పటికే వినుకొండ, అద్దంకి, నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లిలో జైత్రయాత్ర సాగింది. ప్రతిచోటా జనం నీరాజనాలు పలికారు. మండుటెండలో కూడా తమ నాయకుడిని చూసేందుకు మహిళలు, పురుషులు, యువత, అవ్వతాతలు రోడ్డుకిరువైపులా బారులు తీరారు. పిడుగురాళ్లలో జరిగిన సభకు జనం పోటెత్తారు. వినుకొండ నియోజకవర్గం చింతల చెరువు నుంచి ప్రారంభమైన జైత్ర యాత్ర ప్రస్తుతం సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం ధూళిపాళ్ల వద్దకు చేరుకున్న సంగతి తెలిసిందే. తొలిరోజు యాత్ర నూజెండ్ల, వినుకొండ, శావల్యాపురం మండలాల్లో జరిగి గంటావారిపాలెం వద్దకు చేరింది. తర్వాత రోజు ఉగాది రావడంతో అక్కడే ముఖ్యమంత్రి బస చేశారు. ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. బుధవారం కూడా జనప్రవాహం కొనసాగింది. పల్నాడు రోడ్లు జనసంద్రంగా మారి ఆత్మీయ నేతకు సాదర స్వాగతాన్ని పలికాయి. ఎండ 40 డిగ్రీలు దాటినా లెక్క చేయకుండా గంటావారిపాలెం నైట్ స్టే పాయింట్ వద్ద ఉదయం బస్సు యాత్ర మొదలైనప్పటి నుంచి మేమంతా సిద్ధమంటూ ముఖ్యమంత్రి బస్సుతో పాటు ప్రవాహంలా జనం ముందుకు కదిలారు. సంతమాగులూరు అడ్డురోడ్డు, అన్నవరప్పాడు, రొంపిచర్ల, సంతగుడిపాడు, విప్పర్ల, నకరికల్లు గ్రామాలతోపాటు పిడుగురాళ్ల పట్టణంలో ప్రజలు రోడ్లపైకి వచ్చి బారులు తీరారు. తన కోసం ఎదురు చూస్తున్న జనం కోసం సీఎం బస్సు టాప్‌పై నుంచి అభివాదం చేయడంతోపాటు పలుచోట్ల... బస్సు దిగి నేరుగా అవ్వాతాతలను, అక్కచెల్లెమ్మలను, విద్యార్థులతోనూ ముచ్చటించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందాయా? లేదా? మీ ఇంటికి చేరాయా? లేదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలురకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారితో కూడా మాట్లాడి వారి చికిత్సకు అవసరమైన సాయం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. తమ అభిమాన నేత తమ ముందుకు రావడమే కాకుండా తమకు కొండత భరోసాను అందిస్తుండటంతో ఆయనను చూసేందుకు జనం పోటెత్తుతున్నారు.



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న రీజనల్ కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మంత్రి రజిని, ఎంపీ అభ్యర్థి కిలారి, ఎమ్మెల్యే సుచరిత, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, అభ్యర్థులు అంబటి, నూరి ఫాతిమా, బలసాని



సిద్ధమైన సభా ప్రాంగణం

**ఘనస్వాగతానికి ఏర్పాట్లు**

గుంటూరు జిల్లాకు యాత్ర రానుండటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్వాగతం పలికేందుకు గుంటూరు నేతలు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఏటుకూరు వద్ద సభకు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్, మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థులు బలసాని కిరణ్‌కుమార్, నూరి ఫాతిమా, అంబటి మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పరిశీలించారు. అడుగడుగునా ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### బస్సు యాత్ర సాగేదిలా...

సీఎం వైఎస్ జగన్ శుక్రవారం ధూళిపాళ్ల రాత్రి బస నుంచి బయలుదేరుతారు. సత్తెనపల్లి, కొర్రప్రాడు, మేడికొండూరు, పేరేచర్ల జంక్షన్, నల్లపాడు మీదుగా హౌసింగ్ బోర్డు వద్దకు చేరుకుని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం చుట్టుగుంట సర్కిల్, వీఐపీ రోడ్ మీదుగా సాయంత్రం 3.30 గంటలకు ఏటుకూరు బైపాస్ సభ ప్రాంగణానికి చేరుకుని బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. సభ అనంతరం తక్కెళ్లపాడు బైపాస్, పెదకాకాని బైపాస్, వెంగళరావు నగర్, నంబూరు క్రాస్ మీదుగా నంబూరు బైపాస్ దగ్గర రాత్రి బస శిబిరానికి చేరుకుంటారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

# జగనన్న వస్తున్నాడని చెప్పండి

- నేడు ధూళిపాళ్ల నుంచి సత్తెనపల్లి మీదుగా మేమంతా సిద్ధం యాత్ర
- నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు తరలి వచ్చి విజయవంతం చేయాలి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఇంటింటికి వెళ్లండి .. ప్రతి ఒక్కరికీ తెలియజేయండి .. సత్తెనపల్లికి జగనన్న వస్తున్నాడని వివరించండి .. కనీవినీ ఎరుగని రీతిలో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ప్రజాగళం సభ విజయవంతం చేసేందుకు ఒక్కొక్కరికి రూ.300 నగదు, మద్యం బాటిల్ పంపిణీ చేసినప్పటికీ ప్రజలు హాజరు కాక ప్రజాగళం అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. కానీ జగనన్న మేమంతా సిద్ధం బస్సు యాత్రకు డబ్బు, మద్యం పంపిణీ చేసే పరిస్థితి లేదన్నారు. జగనన్నను చూస్తేనే అభిమానులకు కిక్కు ఎక్కుతుందన్నారు. ప్రజల రాక కోసం అవసరమైన వారికి వాహనాలు, భోజన సదుపాయం కల్పించటం జరుగుతుందన్నారు. ఇందు కోసం సత్తెనపల్లిలోని నాలుగు ప్రదేశాలలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన పాదయాత్రలో ఆయన వెంట నడిచానని, ఆయనకు జనం తండోపతండాలుగా వచ్చేవారని అయితే జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాలకు జనం వస్తున్న తీరులో అభిమానంతోపాటు ఒక రకమైన అను భూతికి లోనవుతున్నారన్నారు. ధూళిపాళ్ల నుంచి రోడ్ షో ప్రారంభ మవుతుందని కంకణాలపల్లి అడ్డరోడ్డు, వెన్నాదేవి మీదుగా సత్తెనపల్లి చెక్ పోస్ట్ వద్దకు రాగానే రెండు వైపులా 12 క్రేన్‌లు, పట్టణ శివారులో పెద్ద కాలువ వద్ద మరో 12 క్రేన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ 24 క్రేన్‌లతో భారీ గజమాలలతో జగనన్నను సత్కరిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ కూటమి నుంచి తనపై పోటీ చేసే వారు ఓడిపోతే మళ్లీ కనిపించరన్నారు. నియోజకవర్గంలో మూడోసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, మీరందరూ ఆశీర్వదించాలన్నారు. సమావేశంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి, ముప్పాళ్ల మండల అధ్యక్షుడు నక్కా శ్రీనివాసరావు, కోడిరెక్క దేవదాస్, కౌన్సిలర్లు, మండల, గ్రామ, నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల బాధ్యులు, తదితరులు ఉన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్



సత్తెనపల్లి ఈద్గాలో ముస్లింలతో మంత్రి అంబటి రాంబాబు

**మంత్రి అంబటి రాంబాబు**

సత్తెనపల్లి: రంజాన్ పర్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈద్గాల వద్ద సర్వమత సౌభ్రాతత్వం వెల్లివిరిసింది. మతసామరస్యానికి ప్రత్యేకత రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ముస్లింలు నిర్వహించుకున్నారు. గురువారం పట్టణంలోని ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక నమాజ్ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. ముందుగా ముస్లింలందరికీ ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. పండుగను పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు చేశారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ముస్లిం సామాజికవర్గానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో పేదల పక్షపాతి జగన్‌మోహన్‌రెడ్డిని మీరు అందరూ ఆశీర్వదించాలని కోరారు. ఆయనతోపాటు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగుల్‌బాషా, నాయకులు డాక్టర్ సయ్యద్ సలీం, షేక్ మహ్మద్ గని, షేక్ కరీం, ఎస్ఎం యూనస్, షేక్ జానీ, ముస్లిం సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులు ఉన్నారు.

# భార్యాభర్తలను కబళించిన మృత్యువు



మృతురాలు శివలక్ష్మీదేవిని తరలిస్తున్న పోలీసులు

- కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో దంపతులు మృతి
- గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై కొత్తపాలెం వద్ద ఘటన
- తీవ్రగాయాలైన కుమారుడు
- మృతులు నంద్యాల వాసులు



కారులోనే మృతిచెందిన రాజగోపాలరెడ్డి

వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందిన సంఘటన వినుకొండ రూరల్ మండలం కొత్తపాలెం సమీపంలో గురువారం ఉదయం జరిగింది. వినుకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన గంగారపు రాజగోపాలరెడ్డి, భార్య శివలక్ష్మీదేవి, కుమారుడు రాకేష్‌రెడ్డిలు ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తూ గుంటూరులో నివాసం ఉంటున్నారు. బ్యాంక్ పనుల నిమిత్తమై స్వగ్రామమైన నంద్యాల వెళ్తుండగా గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై కొత్తపాలెం వద్ద కారు అదుపు తప్పి మైలురాయిని ఢీకొట్టి 50 అడుగుల దూరంలోని చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజగోపాలరెడ్డి (53), శివలక్ష్మీదేవి (48) అక్కడికక్కడే మృతిచెందారు. వాహనం నడుపుతున్న రాజగోపాలరెడ్డి సీటులో ఇరుక్కుపోయాడు. కుమారుడు రాకేష్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న వినుకొండ సీఐ సాంబశివరావు, పోలీస్ సిబ్బందితో వెళ్లి కారులో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాలను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గాయపడిన రాకేష్‌రెడ్డిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అభివృద్ధి కావాలంటే ఫ్యాన్‌కు ఓటు వేయండి

- పార్లమెంట్ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్
- నాగవరంలో ఎమ్మెల్యే నంబూరుతో కలసి ఎన్నికల ప్రచారం



నాగవరంలో ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావులకు హారతులిస్తున్న మహిళలు

నాగవరం(క్రోసూరు): పేదల కోసం అవినీతి లేని పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీకి ఓటు వేస్తే మరింత అభివృద్ధి సాధ్యమని నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. క్రోసూరు మండలం నాగవరంలో నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలసి ఎన్నికల ప్రచారం గురువారం నిర్వహించారు. బాణాసంచా కాలుస్తూ పూలు చల్లుతూ అభ్యర్థులకు స్వాగతం పలికారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో మంచి చేశామని భావిస్తేనే ఓటు వేయాలని సీం జగన్ కోరుతున్నారని అన్నారు. అంత ధైర్యంగా చంద్రబాబు ఓట్లు అడగగలడా అన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నేతృత్వంలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో నడిచిందన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమం చూసి మరోసారి తనను, ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌ని గెలిపించాలని కోరారు. అంతకు ముందు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా క్రోసూరులో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### నిష్పాక్షికంగా విధులు నిర్వర్తించాలి

పోలీసు ప్రత్యేక పరిశీలకులు దీపక్‌మిశ్రా



నరసరావుపేట: రానున్న సార్వత్రిక ఎన్నికలలో పోలీస్ సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని పోలీస్ ప్రత్యేక పరిశీలకులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి దీపక్ మిశ్రా అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి జిల్లాలో ఎన్నికల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను పీపీటీ ద్వారా వివరించారు. పోలింగ్ స్టేషన్‌లలో కనీస వసతులు, సి–విజిల్ యాప్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా ఈఎస్ఎంఎస్ విధులలో భాగంగా ఇప్పటివరకు రూ.139.51లక్షలు సీజ్ చేసినట్లు వివరించారు. ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు, అంతర జిల్లాల చెక్‌పోస్టులు, జిల్లా సరిహద్దుల వద్ద తీసుకుంటున్న చర్యలు వివరించారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ శంకబ్రత బాగ్చి, గుంటూరు రేంజి ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి, జేసీ ఏ శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.

# నిత్యం అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ బిందుమాధవ్
- స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన
- ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక ఫోన్ 94407 96184



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

నరసరావుపేట: ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశించారు. అధికారులు స్ట్రాంగ్‌రూంను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అన్నారు. సాధారణ ఎన్నికల దృష్ట్యా గురువారం మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. పరిసర ప్రాంతాలు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట భద్రత, బందోబస్తు ఏర్పాటుచేశామని, ఎన్నికలు పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల నిబంధలు ప్రతి ఒక్కరూ పాటించాలని, వాటిని ఉల్లంఘించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరు గొడవలకు పోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించాలని కోరారు. వన్‌టౌన్, టుటౌన్ సీఐలు, ఎస్సైలు, అధికారులు పాల్గొన్నారు.

**పోలీసుల దృష్టికి తీసుకురండి**

జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా, ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు, దానిని వెంటనే పరిష్కరించే దిశగా జిల్లా పోలీస్ విభాగం అడుగులు వేస్తుందని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ పేర్కొన్నారు. దానిలో భాగంగానే ప్రజల నుంచి ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు అందుకోవడానికి వీలుగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ఫోన్ నంబర్ 94407 96184 కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎవరైనా, ఏదైనా రాజకీయపార్టీ ఎలక్షన్ కమిషన్ నియమావళిని ఉల్లంఘించిన, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించినా వెంటనే పోలీస్ వారి దృష్టికి ఈ నెంబరు ద్వారా తీసుకురావాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

**పోలీంగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు**

నరసరావుపేటరూరల్: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లాఎస్పీ జీ.బిందుమాధవ్ తెలిపారు. మండలంలోని పమిడిపాడులో పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, రూరల్ సీఐ మల్లికార్జున, ఎస్ఐ రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### శాలివాహనుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి

**రాష్ట్ర శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తమ్**

**ఫిరంగిపురం:** రాష్ట్రంలోని శాలివాహన కుమ్మరుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఎనలేనిదని రాష్ట్ర శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తమ్ అన్నారు. మండలంలోని నుదురుపాడు గ్రామంలో గురువారం సాయంత్రం శాలివాహన, కుమ్మరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శాలివాహనుల సంక్షేమం కోసం శాలివాహన కుమ్మరుల కార్పొరేషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. శాలివాహనుల సంక్షేమం కోసం రాష్ట్రంలో 6.25 లక్షల మందికి రూ. 1,680 కోట్లు లబ్ధి చేకూర్చారని చెప్పారు. కవయిత్రి మొల్ల జయంతిని మార్చి 13న రాష్ట్ర పండుగగా నిర్వహించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. కోటప్పకొండలో శాలివాహనుల అన్నదాన సత్రం ఏర్పాటు చేసేందుకుగాను 50 సెంట్ల స్థలాన్ని కేటాయించారన్నారు. అన్ని వేళలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాలివాహన కుమ్మరుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పక్షాన నిలిచి, ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని కోరారు.

## జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు 'సిద్ధం'

- రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- చంద్రబాబు అబద్ధాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- సిద్ధమనే సింహనాదాలు జగనన్న జైత్రయాత్రకు సంకేతాలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- ఏటుకూరులో మేమంతా సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నేతలు

**గుంటూరు రూరల్:** జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధమని ముక్త కంఠంతో చెబుతున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. ఏటుకూరు బైపాస్‌లోని బొంతపాడు వద్ద శుక్రవారం నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభా ప్రాంగణాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే విడదల రజని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే), వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమాలతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలంతా జగనన్న కోసం ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఎదురుచూస్తుంటే, చంద్రబాబు అతని తొత్తు పార్టీలు జగనన్న ఏ పథకాలు అనౌన్స్ చేస్తాడా ప్రజలను ఏవిధంగా మోసం చేద్దామని ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజని మాట్లాడుతూ జగనన్న అంటే ఒక నమ్మకమని ప్రజలు జగనన్ననే నమ్ముతున్నారన్నారు. చంద్రబాబు అబద్ధాల ప్రచారాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ప్రజలంతా జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటేనే వారి కుటుంబాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ పాలన వస్తే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి దిక్కులు పిక్కటిల్లేలా అన్ని వర్గాల ప్రజల నుంచి వినిపిస్తున్న సిద్ధం సిద్ధమనే సింహనాదాలు జగనన్న జైత్రయాత్రకు సంకేతాలని ప్రకటించారు. సిద్ధం సభను జయప్రదం చేయాలని కోరారు. గుంటూరు ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ కొందరు దుష్ట శక్తులు కావాలని ప్రజలను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. నేడు జగరబోయే సిద్ధం సభను ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# 'అన్ని వర్గాలకు అండగా నిలుస్తా'


పిడుగురాళ్ల ఈద్గాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


ఈద్గాలో ముస్లింలతో నమాజ్ పఠిస్తున్న ఎమ్మెల్యే కాసు

- ముస్లింల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- ఈద్గాలో రంజాన్ వేడుకలకు హాజరు

**పిడుగురాళ్ల:** అందరికీ అండగా ఉంటానని, అన్ని రంగాలలో అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న ఈద్గాలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన నమాజ్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధి వైఎస్సార్ సీపీ పాలనలోనే జరిగిందన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముస్లిం సోదరులను అభివృద్ధి పథంలో నడిపించటం జరిగిందన్నారు. భవిష్యత్‌లో ముస్లింల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈద్గాలో ముస్లిం సోదరులతో నమాజ్ ఆచరించి దువ్వాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎండీ గఫార్, ముస్లిం మత పెద్దలు, నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పట్టణంలోని జానపాడు రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు ఘనంగా రంజాన్ నమాజ్‌ను ఆచరించారు. అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండీ ఉస్మాన్‌మేస్త్రీ ఆధ్వర్యంలో పెద్ద మసీద్ నుంచి ఈద్గా వరకు భారీగా ముస్లిం సోదరులు అల్లా నామాన్ని స్మరించుకుంటూ ఈద్గా వరకు వెళ్లారు. రంజాన్ పండుగ ప్రత్యేక నమాజ్‌ను చదివించారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండీ ఉస్మాన్ మేస్త్రీ రంజాన్ విశిష్టత గురించి వివరించారు. మానవాళికి మార్గదర్శకమైన పవిత్ర ఖురాన్ ఈ నెలలోనే అవతరించిందని తెలిపారు. పేదలకు దానధర్మాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

**ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి**

**దుర్గి:** అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తోనే సాధ్యమని పల్నాడు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కాకిరాల గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాల వారు ఆ పార్టీని వీడి ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆ పార్టీకి చెందిన నాయకులు ప్రజాధనాన్ని దోచుకొని దాచుకున్నారని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకి ఓటేసి ప్రభుత్వాన్ని బలపరచాలన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నియోజకవర్గ అభివృద్ధికి సీఎం జగన్ తోడ్పాటు నందించారన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించి భవిష్యత్తులో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు రవి యాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.


కాకిరాలకు చెందిన టీడీపీ వర్గీయులతో ప్రభుత్వ విప్ పీఆర్కే

**వైఎస్సార్ సీపీలో టీడీపీ బూత్ కన్వీనర్లు చేరిక**

**అచ్చంపేట:** మాదిపాడులో టీడీపీకి చెందిన ఇరువురు బూత్ కన్వీనర్లు పాతూరి దానియేలు, పాతూరి జయరాంలతో పాటు ఆ గ్రామ టీడీపీ ఉపాధ్యక్షుడు యాంపొంగు అబ్రహం సైతం టీడీపీకి బైబై చెప్పి గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారి ముగ్గురికి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ మాదా వెంకట్రావు, మాజీ సర్పంచ్ కొరివి వెంకట్రామయ్య, దళిత నాయకుడు చిట్యాల దావీదు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ నాయక్, మైనార్టీ నాయకులు అల్లాబాష్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు. అచ్చంపేటకు చెందిన కాపునేత, జనసేన నాయకుడు వాసా శ్రీకాంత్ గురువారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చేతుల మీదుగా వైఎస్సార్ సీపీ కండువా కప్పించుకున్నారు. కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు రౌతు గోపి, గాదె వీరాంజనేయులు, కొరమరాల రమేష్, వాసు, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ షేక్ జాని తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కన్వీనర్లు, గ్రామ టీడీపీ ఉపాధ్యక్షుడితో ఎమ్మెల్యే శంకరరావు



## బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

**ప్రభుత్వ విప్ పీఆర్కే**


జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

**మాచర్ల:** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన యోధుడు స్వర్గీయ జ్యోతిరావు పూలే అని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ఆర్ అండ్ బీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ మానవతా వాదిగా, బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయుడిగా జ్యోతిరావు పూలే చరిత్రలో నిలిచిపోయారన్నారు. అటువంటి మహనీయుడి ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కౌన్సిలర్‌లు చందూగౌడ్, బత్తిన వేణు, నియోజక వర్గ వైఎస్సార్ సీపీ బీసీ సంఘ అధ్యక్షుడు మల్లికార్జునరావు యాదవ్, వడ్డెంగుంట శివతో పాటు పలువురు బీసీ సంఘ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.



## కొండలమ్మ సేవలో గుంటూరు డీపీఓ

**గుడ్లవల్లేరు:** కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలంలోని వేమవరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుంటూరు జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఆర్.కేశవరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

# ముగిసిన జాతీయ స్థాయి నాటికల పోటీలు

**ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన 'ఇంద్రప్రస్థం' నాటిక**

**యడ్లపాడు:** కొండవీడు కళాపరిషత్, పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవ పరిషత్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయస్థాయి నాటికల పోటీలు గురువారంతో ముగిశాయి. మండలంలోని లింగారావుపాలెం, యడ్లపాడు గ్రామాల్లో ఈ నెల 7 నుంచి ప్రతి రోజు 3 ప్రదర్శనల చొప్పున వరుసగా 4 రోజుల పాటు 12 నాటికలు ప్రదర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ నాటికల్ని ప్రదర్శించారు. ఇరువురు పరిషత్‌ల నిర్వాహకులు సమన్వయంతో పర్యవేక్షణ చేపట్టారు. రెండు చోట్ల న్యాయ నిర్ణేతలుగా టీవీ, రంగస్థల నటులు మల్లాది శివన్నారాయణ, వినోద్‌బాన్సీ, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సృజన వ్యవహరించారు.

**ఉత్తమ ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థం'**

జాతీయ స్థాయి ఆహ్వాన నాటికల పోటీల్లో అభినయ ఆర్ట్స్ (గుంటూరు)వారి 'ఇంద్రప్రస్థం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. ఇదే నాటికకు ఉత్తమ దర్శకులుగా ఎన్ రవీంద్రారెడ్డి, ఉత్తమ నటులుగా వీసీహెచ్‌కే ప్రసాద్, ప్రత్యేక కేటగిరీలో జి. నాగకుసుమ సాయిలకు బహుమతులు లభించాయి. వెలగలేరు ఆర్ట్స్ థియేటర్ (వెలగలేరు) వారి 'రాత' నాటిక ప్రదర్శన ద్వితీయ స్థానంలో నిలిచింది. ఉత్తమ రచయితగా పోలుదాసు శ్రీనివాసరావు, ఉత్తమ నటిగా సురభి వాగ్దేవి నిలిచారు. ప్రత్యేక కేటగిరీలో పవన్‌కల్యాణ్ బహుమతి అందుకున్నారు. తెలుగు కళాసమితి (విశాఖపట్నం) వారి 'నిశ్శబ్దమా..నీ ఖరీదెంతా?' నాటిక తృతీయ బహుమతి పొందగా ఉత్తమ నటుడుగా పి వరప్రసాద్, ఉత్తమ సహాయ నటిగా డి హేమలకు బహుమతులు లభించాయి. 'బంధం' నాటికకు గానూ ఉత్తమ రంగాలంకరణ పి బాబూరావు, ఉత్తమ సంగీత దర్శకులు పి లీలామోహన్, ఉత్తమ నటి ఎం రత్నకుమారి, 'మనస్వినీ' నాటికకు ఉత్తమ ఆహార్యం, ప్రత్యేక కేటగిరీ పి రంగనాయకులు, 'విముక్తి' నాటికకు ఉత్తమ సహాయ నటులు నడింపల్లి వెంకటేశ్వర్లు, ప్రత్యేక కేటగిరీ రామ్‌తేజ ఓం, ఉత్తమ నటుడు కావూరి సత్యనారాయణ(అమృతహస్తం), ఉత్తమ సహాయనటి కరణం సరిత(క్షేత్రం), ఉత్తమ సహాయ నటుడు నాగభట్ల రఘు (కొత్తతరం కొడుకులు), ఉత్తమ సహాయ నటి ఉమా మహేశ్వరి (నాలోన నీవే) బహుమతులు దక్కించు కున్నారు. కళాకారులతో పాటు ప్రేక్షకులకు లక్కీడ్రా ద్వారా 20 మందికి ప్రత్యేక బహుమతులను నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో సుందరయ్య నాటకోత్సవ పరిషత్ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు, పద్మారావు, నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకరరావు, కొండవీడు కళాపరిషత్ కట్టా శ్రీహరిరావు, తోకల సాంబశివరావు, మండెపూడి శ్రీనివాసరావు, మల్నేని సీతా రామాంజనేయులు, నంబూరి వీరాంజనేయులు, కనపర్తి శ్రీనివాసరావు ఉన్నారు.


ఉత్తమ ప్రదర్శన ఇంద్రప్రస్థం నాటికకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

# 'స్వలాభం కోసమే దిగజారుడు రాజకీయాలు'

- వ్యసనపరుడిని అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకుల అసత్య ఆరోపణలు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సభావత్ రవినాయక్


మాట్లాడుతున్న సభావత్ రవి నాయక్, బాలు నాయక్, మరియదాసు

**మాచర్ల రూరల్:** మద్యానికి వ్యసనపరుడిగా మారి మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన తీరుపై బాధిత మహిళ భర్త మందలించిన ఘటనకు టీడీపీ నాయకులు రాజకీయ రంగు పులుముతూ నీచ రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సభావత్ రవినాయక్ అన్నారు. గురువారం మండలంలోని అచ్చమ్మకుంట గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన బాణావత్ ఛత్రియ నాయక్ అల్లరి చిల్లరగా తిరుగుతూ మద్యం సేవిస్తూ తరచూ పలువురిపై ఘర్షణకు దిగుతుంటాడని చెప్పారు. బుధవారం గ్రామానికి చెందిన రమావత్ శరవణ్ నాయక్ భార్య లలితాబాయితో అసభ్యంగా ప్రవర్తిస్తూ ఆమెపై దూషణకు దిగాడని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆమె భర్త శరవణ్ నాయక్ ఛత్రియా నాయక్‌ను నెట్టివేయగా అతని తలకు చిన్న గాయమైందని అన్నారు. ఈ ఘటనను రాజకీయంగా వాడుకునేందుకు టీడీపీ నాయకులు ఛత్రియా నాయక్‌ను 'సిద్ధం' సభకు రాలేదని దాడి చేశారని ఆరోపించటం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. గ్రామంలో ఎవరి నడిగినా వాస్తవాలు చెబుతారని అన్నారు. ఛత్రియానాయక్ ఐదేళ్ల క్రితం చింతలతండా గ్రామం నుంచి ఇల్లరికం వచ్చాడని, అక్కడ ఇతని ఆగడాలు తట్టుకోలేక ఆ గ్రామస్తులు తరిమి కొడితే ఇక్కడకు వచ్చాడన్నారు. అతని ప్రవర్తనలో మార్పు రాక బంధువులు సైతం వదిలేసిన పరిస్థితి ఉందన్నారు. జనవరిలో వరికపుడిశెల శంకుస్థాపనకు మాచర్లకు వచ్చిన జగన్ సభకు వెళ్లకుండా అడ్డుకున్నాడని, ఇలాంటి వ్యక్తిని మా 'సిద్ధం' సభకు ఎలా పిలుస్తామని ప్రశ్నించారు. కనీస జ్ఞానం టీడీపీ నాయకులకు లేకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ప్యాకేజీతో కార్లలో షికార్లు కొడుతూ ఓట్లు, సీట్లు కోసం ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకు లేనిపోని ఘర్షణలు సృష్టిస్తూ నీచమైన రాజకీయాలు చేయటం హేయమైన చర్యగా అభివర్ణించారు. సమావేశంలో బాలునాయక్, మరియదాసు తదితరులున్నారు.

## మేనకోడలి ముఖంపై మేనమామ కత్తితో దాడి



**సత్తెనపల్లి:** మేనకోడలి ముఖంపై కత్తితో వ్యక్తి దాడి చేసిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 10వ వార్డులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 10వ వార్డుకు చెందిన సరిత అనే యువతిపై మేనమామ శిఖా వెంకటేష్ కత్తితో ముఖంపై దాడి చేశాడు. దీంతో ఆమె ముఖంపై రక్తస్రావమైంది. బాధితురాలిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స చేసి గుంటూరుకు రిఫర్ చేశారు. కళ్ల సమీపంలో కత్తితో దాడి చేయడంతో కళ్లకు ప్రమాదం వాటిల్లే అవకాశముందని వైద్యులు తెలిపారు. కాగా గత 15 రోజుల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో వెంకటేష్ కుటుంబ సభ్యులపై పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయగా తమ పైనే ఫిర్యాదు చేస్తావా అంటూ వెంకటేష్ కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు తెలిపింది. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పవిత్రమైనది గురుత్వం

- పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య
- పెదకూరపాడులో లూర్థుమాత గుహ ప్రారంభం
- వైభవంగా గురుశ్రీ పుట్టి సుందర రాజు 40వ గురు పట్టాభిషేకం


ప్రత్యేక దివ్య బలిపూజ నిర్వహిస్తున్న పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య

**పెదకూరపాడు:** గురుత్వం ఎంతో పవిత్రమైనదని, గురువులు క్రీస్తు ప్రతినిధులని గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. పెదకూరపాడులోని ముగ్గురు రాజుల దేవాలయంలో లూర్థుమాత గుహను, స్థానిక విచారణ గురువులు పుట్టి సుందరరాజు 40వ గురు పట్టాభిషేక వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దివ్య బలిపూజలను పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూబీ జూబ్లీ జరుపుకుంటున్న పుట్టి సుందరరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. 40 సంవత్సరాలు పాటు గురువుగా అనేక మంది విశ్వాసులకు దేవుని సువార్తను అందించారని చెప్పారు. దేవుడు ఇచ్చిన అభిషేక వరంతో సుందరరాజు ఆయన సేవలో ముందుకు సాగాలన్నారు.

# టెన్త్ పౌష్టికాహార బిల్లుల చెల్లింపులు

**గుంటూరుఎడ్యుకేషన్:** ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థుల పౌష్టికాహారానికి సంబంధించిన నిధులను విడుదల చేసిన జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులకు చెల్లింపులు జరుపుతోంది. టెన్త్ విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ముందస్తుగా తమ సొంత నిధులను ఖర్చు చేసిన హెచ్‌ఎంలకు వారు ఖర్చు చేసిన మొత్తాన్ని చెల్లించే విధంగా మూడు జిల్లాల డీఈవోల ఖాతాల్లో నిధులు జమయ్యాయి. గత మార్చిలో జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ముందుగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 400 ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి సన్నద్ధమైన 27,201 మంది విద్యార్థులకు సాయంత్రం వేళల్లో బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు జెడ్పీ నుంచి రూ.61,20,225 నిధులు మంజూరు చేశారు. గుంటూరు జిల్లా పరిధిలోని 144 హైస్కూళ్లలో 9,686 మంది విద్యార్థులకు సంబంధించి రూ.21,79,350, పల్నాడు జిల్లాలోని 176 హైస్కూళ్లలో 13,205 మంది విద్యార్థులకు రూ.29,71,125, బాపట్ల జిల్లాలోని 80 హైస్కూళ్ల పరిధిలో 4,310 మంది విద్యార్థులకు సంబంధించి, అల్పాహారానికి ఖర్చు చేసిన నిధులను రీ–యింబర్స్ చేస్తూ గతంలోనే జెడ్పీ సీఈవో ఎస్వీబీఎస్ వసంతరాయుడు ఉత్తర్వులు విడుదల చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వారీగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేసిన అల్పాహారానికి సంబంధించిన నిధుల వినియోగ ధృవపత్రాలను సమర్పించి, నిధులను పొందాలని సూచించారు. ప్రస్తుతం మూడు జిల్లాల పరిధిలో హెచ్‌ఎంలు సంబంధిత నిధులు పొందేందుకు నిధుల వినియోగ వివరాలు సమర్పిస్తున్నారు.